సాక్షి
వికారాబాద్
శనివారం । 6 । జనవరి । 2024



బలగం పెంచుకుంటున్న..

పరిగి నియోజకవర్గానికి చెందిన మనోహర్ రెడ్డి ఆ సెగ్మెంట్ నుంచి బీఆర్ఎస్ టికెట్ కోసం దశాబ్దకాలం యత్నించారు. 8లో▸



అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



మరో ఎక్స్‌ప్రెస్ సర్వీస్

స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో మరో బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న గడువు

పెద్దేముల్: 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు శనివారంతో గడువు ముగియనున్నట్లు పెద్దేముల్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2023 – 24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

అనంతగిరి: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జూనియర్ విభాగం బాల బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం నాయక్, ప్రధాన కార్య దర్శి వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 9గంటలకు కుల్కచర్లలోని కేవీఎం స్కూల్ మైదానంలో జట్ల ఎంపిక ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు 5–2–2004 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. బాలురు 70కిలోలు, బాలికలు 65 కిలోల లోపు ఉండాలన్నారు. క్రీడాకారులు పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్ రాజేందర్ నాయక్ సెల్ నంబర్ 99592 93604లో సంప్రదించాలని సూచించారు.

ఫైళ్లను పెండింగ్‌లో పెట్టొద్దు

రంగారెడ్డి కలెక్టర్ శశాంక



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతి శాఖలో ఈ–ఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, కార్యాలయాల్లో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ, శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలను శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

‘ఉత్తి’ పోతలే..!

జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు గ్రహణం

- కాలిపోయిన మోటార్లు.. కూలిన కాలువలు
- విద్యుత్ బకాయిలు రూ.5 లక్షలు
- శిథిలావస్థలో జీవన్గీ, నావంద్గీ, ఇందర్‌చెడ్, దోర్నాల్ లిఫ్టులు
- బీళ్లుగా 2వేల ఎకరాల ఆయకట్టు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు



నిరుపయోగంగా నావంద్గీ ఎత్తిపోతల పథకం

బషీరాబాద్: సీఎం సొంత జిల్లాలో ఎత్తిపోతల పథకాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారాయి. ఈ ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో కాగ్నా నదిపై నాలుగు దశాబ్దాల క్రితం నాలుగు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. అప్పటి నుంచి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీటి నిర్వాహణ బాధ్యతలు పర్యవేక్షించేది. ప్రారంభంలో సుమారు 2 వేల ఎకరాల వరకు సాగునీరు పారడంతో రైతులు వరి, వేరుశనగ, ఇతర ఆరుతడి పంటలు పండించేవారు. ఈ పథకాలకు సాగు నీటి సంఘాలు సైతం చాలా కీలకంగా పని చేశాయి. అయితే ప్రభుత్వాలు వీటిపట్ల నిర్లక్ష్యం చూపడంతో నిర్వాహణ వ్యయం పెరిగి ఏడాదిన్నర కిందటే ఐడీసీ చేతులెత్తేసింది. దీంతో జీవన్గీ, నావంద్గీ, ఇందర్‌చెడ్, దోర్నాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మూతపడ్డాయి. వెరసి 2వేల ఎకరాల ఆయకట్టు బీళ్లుగా మారిపోయాయి. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాలు మళ్లీ ఆ ప్రభుత్వమే అధికారంలోకి రావడంతో రైతులు ఆశలు మొదలయ్యాయి.

నాలుగు ప్రధాన లిఫ్టులు

జిల్లాలో ప్రధాన నది అయిన కాగ్నా ధారూరు, పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల మీదుగా ప్రవహిస్తూ దిగువనున్న కర్ణాటకలో కలుస్తుంది. వర్షాకాలంలో భారీ వరద నీరు ప్రవహిస్తూ భీమా నదిలో కలుస్తుంది. అయితే ఈ నీటిని వ్యవసాయానికి వాడుకోవడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1974లో బషీరాబాద్ మండలంలో జీవన్గీ, నావంద్గీ, ఇందర్‌చెడ్, ధారూరు మండలంలో ధోర్నాల్ దగ్గర నాలుగు ప్రధాన లిఫ్టులను ఏర్పాటు చేసింది. వీటి కింద 2వేల ఎకరాలకు సాగునీరు అందించేలా కాలువలు నిర్మించారు. అయితే కాలువల మరమ్మతులకు, మోటార్ల మరమ్మతులకు, కరెంటు బిల్లుల చెల్లింపులకు కొంత కాలం ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతోపాటు ఆయకట్టు రైతుల నీటి పన్నుల ద్వారా కొనసాగుతూ వచ్చింది. అయితే ధోర్నాల్, జీవన్గీ, ఇందర్‌చెడ్ లిఫ్ట్ ఇరిగేషన్ల నిర్వాహణ భారంగా మారడంతో రెండు దశాబ్దాలుగా మూత పడ్డాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మోటార్లు కాలిపోయాయి. కాలువలు ధ్వంసమై పోయాయి. బావులు పూడి పోయి శిథిలావస్థకు చేరాయి. బషీరాబాద్ పక్కనే ఉన్న నావంద్గీ లిఫ్ట్ ద్వారా 2012 వరకు 550 ఎకరాలకు సాగునీరు అందింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల మరమ్మతులకు రూ.8 లక్షలు మంజూరు చేసింది. అలాగే పంపు నుంచి కాలువల వరకు కొత్తగా పైప్ లైన్ వేశారు. ప్రస్తుతం అవి కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఆయకట్టు రైతులు బోర్ల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. మరి కొందరు పొలాలను బీళ్లుగా వదిలేశారు. ఇదిలా ఉండగా జీవన్గీ దగ్గర కాగ్నాలో రైతులు మోటార్లు బిగించి ఆరుతడి పంటలు పండిస్తున్నారు. జీవన్గీ దిగువ భాగాన కర్ణాటక ప్రభుత్వం చెక్ డ్యాం నిర్మించడంతో బ్యాక్ వాటర్ ద్వారా పంటలు పండిస్తున్నారు.



శిథిలావస్థలో కాలువ

ఎత్తిపోతల పథకాలు.. ఆయకట్టు

పథకం పేరు	ఆయకట్టు (ఎకరాల్లో..)
నావంద్గీ	550
ఇందర్‌చెడ్	600
జీవన్గీ	600
దోర్నాల్	250

భారీగా విద్యుత్ బకాయిలు

జిల్లాలోని నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వాహణకు వినియోగించిన విద్యుత్ బకాయి రూ.5 లక్షలు ఉన్నట్లు ట్రాన్స్‌కో తెలిపింది. దీంతో కరెంటు సరఫరాను నిలిపివేశారు. అలాగే మోటార్లు కూడా కాలిపోయాయి. కొన్ని చోట్ల మోటార్లకు సంబంధించిన వస్తువులు కూడా మాయమయ్యాయి. అటు పక్క కన్నెత్తి చూసేవారే కరువవడంతో బావులు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పథకం మూలకు చేరింది.

ఐడీసీ నుంచి ఇరిగేషన్ శాఖకు..

రాష్ట్రంలోని మైనర్, మధ్య తరహా, భారీ తరహా సాగునీటి ప్రాజెక్టులన్నీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఐడీసీ (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి సాగునీటి శాఖకు బాధ్యతలు అప్పగిస్తూ 2022లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ శాఖ అధికారుల లిఫ్ట్ ఇరిగేషన్‌పై దృష్టి పెట్టారు. లిఫ్టులు ఎందుకు మూతపడ్డాయి.. వాటి విద్యుత్ బకాయిలు ఎంత, ఆయకట్టు లెక్కలు తీసింది. రెండు నెలల కిందట సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపింది.

వినియోగంలోకి తేవాలి



నావంద్గీ ఎత్తి పోతల పథకం కింద వందల ఎకరాల భూములు పడావ్ పడ్డాయి. ఒకప్పుడు రెండు పసళ్ల ఆయకట్టుకు సాగు నీరు అందేది. వరి, వేరుశనగ పండించేవాళ్లం. అయితే ఇప్పుడు అవి మూత పడడంతో బోర్లు వేసుకొని తరి పంటలు పండిస్తున్నాం. నదిలో పుష్కలంగా నీళ్లున్నాయి. నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే వెయ్యి ఎకరాలు సాగులోకి వస్తుంది.

– వీరన్న, రైతు, నావంద్గీ

రూ.95 లక్షలతో ప్రతిపాదనలు



జిల్లాలోని నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్లు పని చేయడం లేదు. వాటి నిర్వాహణకు భారీగా ఖర్చు అవుతుంది. ఇప్పటికే వీటన్నింటికీ విద్యుత్ సరఫరాను నిలిపేశారు. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాం. నావంద్గీ ఎత్తిపోతల మరమ్మతులకు రూ.30 లక్షలు, ధోర్నాల మరమ్మతులకు రూ.65 లక్షలు అవసరం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– సుందర్, ఈఈ ఇరిగేషన్

భగ్గుమన్న వర్గపోరు

- మరోసారి బయటపడ్డ పట్నం – పైలెట్ వైరం
- తెలంగాణ భవన్ వేదికగా పరస్పర దూషణలు

తాండూరు: బీఆర్ఎస్ తాండూరు నేతల వర్గపోరు మరోసారి బయటపడింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో పార్టీ ఓటమికి పట్నం కుటుంబ సభ్యులే కారణమంటూ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తోపాటు ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్ వేదికగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం పట్నం వర్సెస్ పైలెట్ అన్న తరహాలో సాగింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మధ్య 2016 నుంచి వైరం సాగుతోంది. అప్పట్లో ఇద్దరు నేతలు బీఆర్ఎస్‌లో ఉండేవారు. మంత్రిగా ఉన్న మహేందర్‌రెడ్డి పైలెట్ రోహిత్‌రెడ్డిని తాండూరులో పర్యటించకుండా అడ్డుకున్నారు. ఆ తర్వాత పైలెట్ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి పట్నం మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ఆరు నెలల తరువాత తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. అప్పట్లో పట్నం మహేందర్‌రెడ్డితో సఖ్యతగా మెలిగారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇద్దరి మధ్య మరోసారి విభేదాలు తలెత్తాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి సునీతారెడ్డికి దక్కింది. నాటి నుంచి ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఈ క్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి.. మహేందర్‌రెడ్డి ఆయన అనుచరులను రాజకీయంగా, ఆర్థికంగా నష్టం కలిగిస్తూ వచ్చారు. అప్పట్లో పలు సార్లు మహేందర్ రెడ్డి పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు నేతలు టికెట్ ఆశించారు. కానీ కేసీఆర్ రోహిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చి పట్నం మహేందర్‌రెడ్డిని మంత్రిని చేసి శాంతపరిచారు. ఇద్దరూ కలసి పార్టీ కోసం పని చేయాలని ఆదేశించారు. దీంతో వారు ఒకే వేదికను పంచుకొని ముందుకు సాగారు. ఇదిలా ఉండగా జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ కారణంగానే రోహిత్‌రెడ్డి ఓడిపోయారని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ వేదికగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఇదే అంశంపై రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఎదుటే పరస్పరం దూషించుకున్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన పట్నం కుటుంబాన్ని సస్పెండ్ చేయాలని పైలెట్ అనుచరులు నినాదాలు చేశారు. పట్నం వర్గీయులు కూడా ఎదురు దాడికి దిగారు. ఇద్దరు నేతలతో హరీశ్‌రావు వేర్వేరుగా మాట్లాడి శాంతింపజేశారు.

హోర్డింగ్‌లను వదిలేశారు!

- తొలగింపునకు ముందుకు రాని ఏజెన్సీలు
- కాగితాలకే పరిమితమైన కార్యాచరణ
- కాలయాపనతో పెరిగిపోతున్న వీటి సంఖ్య
- మళ్లీ టెండర్లను పిలిచిన జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో అక్రమ హోర్డింగులు, యూనిపోల్స్ తదితర వ్యాపార ప్రకటనలకు సంబంధించిన బోర్డుల తొలగింపు కాగితాల్లో తప్ప కార్యాచరణకు నోచుకోవడం లేదు. గ్రేటర్ నగరంలో రెండువేలకు పైగా ఉన్న ఇలాంటి వాటిని తొలగిస్తామని జీహెచ్ఎంసీ ప్రకటించి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. వీటిని తొలగించేందుకు గతంలో సైతం రెండు మూడు పర్యాయాలు టెండర్లు ఆహ్వానించినప్పటికీ కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. భవనాల రూఫ్‌టాప్‌లు తదితర ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులను యజమానులే తొలగించాల్సిందిగా ఆదేశించింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేక, ఇక తామే తొలగించేందుకు యంత్రాంగం సిద్ధమై టెండర్లు పిలిచినా ఏజెన్సీలు ముందుకు రాలేదు. టెండరు నిబంధనల మేరకు హోర్డింగులతో పాటు యూనిపోల్స్, బస్‌షెల్టర్స్,గ్లో సైన్ బోర్డులు, ఇతరత్రా వ్యాపార ప్రకటనలన్నీ తొలగించే బాధ్యత ఏజెన్సీలదే. ఇందు కోసం ఏజెన్సీలకు జీహెచ్ఎంసీ చెల్లించేదేమీ లేదు. జీహెచ్ఎంసీకే అవి చెల్లించాలి. అందుకే ఏజెన్సీలు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఇదంతా నిబంధనాలతోనే..

- హోర్డింగులను తొలగించడంతో వెలువడే ఐరన్, స్క్రాప్ ఏజెన్సీ తీసుకోవాలి. ఇందుకోసం టన్నుకు ఇంత అనే రేటు వంతున జీహెచ్ఎంసీకి చెల్లించాలి. అలా జీహెచ్ఎంసీకి ఎక్కువ రేట్ (హెచ్1) ఇచ్చేందుకు ముందుకొచ్చే ఏజెన్సీలకు హోర్డింగులను తొలగించే టెండరు ఖరారు చేస్తుంది. అంతేకాదు.. క్షేత్రస్థాయిలో ఎన్ని హోర్డింగులున్నాయో, వాటిని తొలగించడం ద్వారా రాగల ఆదాయమెంతో తదితరాలను ఏజెన్సీలే అంచనా వేసుకొని టెండరులో పాల్గొనాలి. తొలగించేందుకు అనువైన పరిస్థితులున్నదీ, లేనిదీ చూసుకోవాలి. అవన్నీ చూసుకొని తొలగించే బాధ్యత ఏజెన్సీలదే.
- తొలగింపు సందర్భంగా ఎదురయ్యే సమస్యలు సైతం ఏజెన్సీలే పరిష్కరించుకోవాలి. జీహెచ్ఎంసీ సహకరించదు. ఇలాంటి నిబంధనలుండటం వల్లే కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రావడం లేదని పలువురు భావిస్తున్నారు.దీంతో, జీహెచ్ఎంసీ కాగితాల్లో చూపేందుకు మాత్రమే ఈ టెండర్లు ఆహ్వానిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోర్డింగుల తొలగింపు పనులను ఏజెన్సీలకు కాంట్రాక్టుకిచ్చే బదులు జీహెచ్ఎంసీయే స్వయంగా చేపడితే పనులు జరగవచ్చనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఆ పని చేయాలని, అలా కాకుండా నిబంధనలు మార్చకుండా కేవలం టెండర్లు ఆహ్వానించినంత మాత్రాన ప్రయోజనం ఉండదని పలువురు భావిస్తున్నారు.

దరఖాస్తులు 2,43,670

నేటితో ముగియనున్న ‘ప్రజాపాలన’

- జిల్లాలో 1,94,956 కుటుంబాలు
- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 2,43,670
- 3లక్షల వరకు వచ్చే అవకాశం
- ఆన్‌లైన్ నమోదుకు సన్నాహాలు



ప్రజాపాలనపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం విధించిన గడువు శనివారంతో ముగియనుంది. గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అనుకున్న దానికంటే ఎక్కువగానే దరఖాస్తులు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చాక అభయ హస్తం పేరుతో దరఖాస్తులు స్వీకరిస్తోంది. శనివారంతో ప్రజాపాలన గడువు ముగియనుంది.

50శాతం అధికంగా..

ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 18 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 565 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 663 చోట్ల గ్రామ సభలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 563 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 1,94,956 కుటుంబాలు ఉండగా ఇప్పటికే 2,43,670 దరఖాస్తులు వచ్చాయి. మరో రోజు మిగిలి ఉండటంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ సంఖ్య మూడు లక్షలు దాటవచ్చని అధికారులు అంటున్నారు.

డాటా ఎంట్రీకి కసరత్తు

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి కాగానే డాటా ఎంట్రీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. శుక్రవారం అధికారులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి డాటా ఎంట్రీకి సంబంధించి విధి విధానాలు, సూచనలు చేశారు. ఈ ప్రక్రియను ఈ నెల 17వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం 3లక్షల పైచిలుకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 57 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో 20 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉండగా.. పది మంది చొప్పున రాత్రి పగలు రెండు షిఫ్టుల్లో పని చేయనున్నారు.

సకాలంలో పూర్తి కావాలి

ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగుస్తుంది. మిగిలిన వారు వారి వారి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, వార్డు ఆఫీ సర్లకు దరఖాస్తులు ఇవ్వొచ్చు. డాటా ఎంట్రీలో పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటాం. వివరాలు నమోదు చేసిన ఆపరేటర్ ఆ దరఖాస్తు ఫారం చివరలో సంతకం చేయాలి. డాటా ఎంట్రీకి అన్ని వసతులు కల్పించాం. ఈ 17వ తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేయాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్

ఆసక్తి చూపట్లే..!



ఆయిల్ పామ్ సాగుపై రైతుల అనాసక్తి

- 2023–24 సాగు లక్ష్యం 3వేల ఎకరాలు
- ఇప్పటి వరకు 1,089 ఎకరాలు సిద్ధం
- మిగిలింది ఆరు నెలల గడువే
- కొత్త ప్రభుత్వ ప్రోత్సాహంపై అన్నదాతల సంశయం

వికారాబాద్ అర్బన్: ఆయిల్ పామ్ పంట గురించి జిల్లా రైతులు వినడమే కాని సాగుపై పెద్దగా అవగాహన లేదు. రైతులకు అవగాహన కల్పించడంతోపాటు, సబ్సిడీ రూపంలో చేయూతనందించి జిల్లాలో సాగును ప్రోత్సహించాలని అధికారులు ప్రయత్నం చేస్తున్నా రైతుల నుంచి ఆశించిన మేర ఆసక్తి కనబడటం లేదు. గత ఏడాది రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో కొత్తగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని గత ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాను కూడా ఎంపిక చేసింది. జిల్లాలో దశల వారీగా 31వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని ఉద్యానవన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాలని సంకల్పించారు.

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో 31వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం ఉండగా, 2023 – 24 సంవత్సరానికి గాను 3వేల ఎకరాల్లో పంట సాగు చేయాలని నిర్ణయించారు. జూలై రెండో వారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి అనువైన భూములను గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. గత జూలై నుంచి ఇప్పటి వరకు 1,089 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధమయ్యారు. లక్ష్యాన్ని చేరేందుకు మరో ఆరు నెలల గడువు మాత్రమే ఉంది. ఈలోగా మిగతా 2వేల ఎకరాల్లో పంట సాగుకు రైతులను సిద్ధం చేయాలి. ఇది కొంత కష్టమేనని చెప్పవచ్చు. అయితే చాలా మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గతంలో ఈ పంట సాగు చేసిన అనుభవం లేకపోవడం,ఇక్కడి వాతావరణం అనుకూలిస్తుందా లేదా అనే అనుమానం రైతులను వెంటాడుతోంది.

కొత్త ప్రభుత్వం ప్రోత్సహించేనా?

మార్కెట్‌లో స్వీట్ ఆయిల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో గత ఏడాది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. 80నుంచి 90శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇదే సబ్సిడీతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందా లేక ఆపేస్తుందా అనే అనుమానం రైతులను వెంటాడుతోంది. కొత్త ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటల సాగుపై ఒక నిర్ణయం తీసుకునేంత వరకు వేచి చూడాలనే ధోరణిలో రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. పైగా ఆయిల్ పామ్ తోటకు పుష్కలంగా నీటి సౌకర్యం ఉండాలి. జిల్లాలోని నాలుగు డివిజన్లలో నాలుగు కాలాల పాటు పుష్కలంగా నీరు ఉండే ప్రాంతాలు చాలా తక్కువ. జిల్లాలో అత్యధిక పంటలు వర్షపాతం, బోరు బావులపై ఆధారపడి సాగవుతాయి. అలాంటప్పుడు పామ్ ఆయిల్ సాగు కొంత కష్టమనే చెప్పవచ్చు.

టార్గెట్ పూర్తి చేస్తాం



జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కొత్తదే అయినా రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. సాధారణ ఎన్నికలు రావడంతో రైతులను సాగుకు సిద్ధం చేయలేక పోయాం. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుండటంతో అధికారులు బిజీగా ఉన్నారు. 10వ తేదీ తరువాత యుద్ధ ప్రాతిపాదికన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను పామ్ ఆయిల్ సాగుకు సిద్ధం చేస్తాం.3వేల ఎకరాల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటికే చాలా మంది రైతులు మొక్కల కోసం డీడీలు చెల్లించారు. అయితే ఈ పంట సాగుకు నీరు పుష్కలంగా ఉండాలి. ఎండకాలంలో కూడా నీరు అవసరం. నీటి సౌకర్యం ఉన్న రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుంది.

– చక్రపాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

క్లుప్తంగా

డాటా ఎంట్రీలో తప్పులుండొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి



డాటా ఎంట్రీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల డాటా ఎంట్రీలో తప్పులుండొద్దని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలన వెబ్‌సైట్‌లో డాటా ఎంట్రీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డాటా ఎంట్రీ చేసేటప్పుడు దరఖాస్తుదారుడి పేరు, ఏ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు అట్టి సమాచారాన్ని తప్పులు లేకుండా పూర్తి శ్రద్ధతో ఆపరేటర్లు నమోదు చేయాలని సూచించారు. జనవరి 17 వరకు ఈ పనులను పూర్తి చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఉన్నారు.

భాషా పండితులకు న్యాయం చేయండి

ఆర్‌యూపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజాజ్ అహ్మద్



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పండితులు

బంట్వారం: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్‌యూపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజాజ్ అహ్మద్ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న భాషా పండితుల సమస్యలను సత్వరమే గుర్తించి న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల భాషా పండితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రంలో చోటుచేసుకుంది. యాచారం సీఐ సైదయ్య ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన నాగలపల్లి రాంరెడ్డి (65) శుక్రవారం తన స్కూటీపై మాల్ మార్కెట్‌కు వెళ్లాడు. మార్గ మధ్యలో మాల్ మార్కెట్ సమీపంలోని మైసమ్మ దేవాలయ దగ్గర నల్గొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రాంరెడ్డి స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

షాబాద్: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో గురువారం రాత్రి 11గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం.రాఘవేందర్‌గౌడ్(21) నాగర్‌గూడ నుంచి ఇంటికి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో భారత్ గ్యాస్ గోదాం వద్దరకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఛాతిలో బలమైన గాయమవ్వడంతో చికిత్స నిమిత్తం షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శిఖం భూమిలో వెలిసిన ప్రహరీ

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని తాళ్లకుంట శిఖం భూమిలో వెలిసిన నిర్మాణాలను మున్సిపాలిటీ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను గుర్తించిన గ్రామస్తులు మున్సిపాలిటీ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, జల్‌పల్లి టీపీవో హబీబున్నీసాలు తమ సిబ్బందితో కలిసి కుంటకు చేరుకొని అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం జేసీబీతో ప్రహరీతో పాటు ఒక బేస్‌మెంట్‌ను కూల్చివేశారు. కుంటలోకి నీరు పోకుండా మట్టితో నింపి వేసిన రోడ్లను కూడా తవ్వి నీరు వెళ్లే మార్గం చేశారు. కాగా 6.20 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కుంట పరిధిలో 169 సర్వే నంబర్‌లో శిఖం భూమి ఉందన్నారు. 208–పార్ట్, 211–పార్ట్, 212–పార్ట్, 213–పార్ట్ సర్వే నంబర్లలో నీరు నిల్వ ఉండే ప్రాంతమని ఇందులో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వరాదని మున్సిపాలిటీ అధికారులకు లేఖ రాశామని ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బలగం పెంచుకుంటున్న బీఎంఆర్

సొంత నియోజకవర్గమైన పరిగి మాదిరిగానే తాండూరులోనూ తన వర్గాన్ని తయారు చేసుకునేందుకు ఎమ్మెల్యే నజర్ వేశారు. నియోజకవర్గంలోని పెద్దల అనుచరులు మనోహర్‌రెడ్డి విజయానికి కృషి చేశారు. భవిష్యత్‌లో రాజకీయంగా ఎదగాలంటే బలగం పెంచుకోవాలని బీఎంఆర్ దృష్టిసారించారు.

- సొంతంగా కేడర్ ఏర్పాటు చేసుకునేందుకు ఫోకస్
- దూకుడు పెంచిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పరిగి నియోజకవర్గానికి చెందిన మనోహర్‌రెడ్డి ఆ సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ టికెట్ కోసం దశాబ్దకాలం యత్నించారు. తన ప్రయత్నంలో భాగంగా తనకంటూ కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా బీఆర్‌ఎస్ అధిష్టానం సిట్టింగ్‌లకే టికెట్‌లు కేటాయించడంతో ఆయన కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ఎన్నికలకు 50 రోజుల ముందుగా కాంగ్రెస్‌లో చేరి టికెట్ తాండూరు దక్కించుకున్నారు. ఏఐసీసీ సభ్యుడు రమేశ్‌మహరాజ్ కేడర్‌తో పాటుగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరారు. డాక్టర్ సంపత్‌కుమార్ వర్గం సైతం మనోహర్‌రెడ్డి గెలుపు కోసం శ్రమించారు. అయితే విజయం సాధించినా.. ఆశించిన స్థాయిలో కోలాహలం కనిపించకపోవడంతో ఆయనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకునేందుకు ఫోకస్ పెట్టారు.

పట్టు సాధించేందుకు ప్రయత్నం

జిల్లాలో తాండూరు సెగ్మెంట్ కాంగ్రెస్‌కు కంచుకోట. అభ్యర్థి ఎవరైనా పార్టీ ఓటు బ్యాంకు తటస్థంగా ఉంటుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత మూడు పర్యాయాలు ఎన్నికలు జరిగితే రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023 ఎన్నికల్లోనూ పదుల సంఖ్యలో నేతలు టికెట్ ఆశించారు. అయితే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనతో తాండూరు సీటును డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డికి కేటాయించారు. ఎన్నికలకు నెల రోజుల ముందు వరకు తాండూరు నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు టికెట్ విషయంలో స్పష్టత రాకపోవడంతో మెజార్టీ నాయకులు దూరంగా ఉన్నారు. మరోవైపు పార్టీ వీడిన వారితో పాటుగా.. రోహిత్‌రెడ్డి వెంట వెళ్లిన వారంతా సొంతగూటికి చేరుకున్నారు. దీంతో కాంగ్రెస్ పటిష్టంగా మారింది. ఇక్కడ రమేశ్ మహరాజ్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత కేడర్ ఉంది. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితా భర్త సంపత్‌కుమార్‌కు సైతం కేడర్ ఉంది. ఎమ్మెల్యే బీఎంఆర్ అదే బాటలో బలగం పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి.



వచ్చిన వారుంటారా..?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పార్టీలోనే కొనసాగుతారా..? రమేశ్ మహరాజ్ వర్గీయులు సైతం భవిషత్‌లో ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు.

పదవుల పంపకంలో పెద్దపీట

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నియోజకవర్గంపై ఇంకా పూర్తిగా పట్టు సాధించలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే వెంట రమేశ్ మహరాజ్ వర్గీయులు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అనుచరగణం, డాక్టర్ సంపత్‌కుమార్‌కు చెందిన అనుచరగణమే వెంట నడుస్తున్నారు. అయితే తాండూరు అసెంబ్లీ స్థానంపై పట్టు సాధించాలని ఎమ్మెల్యే అడుగులు వేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. మరో రెండు దశాబ్దాల వరకు తాండూరు సీటు మనోహర్‌రెడ్డి చేతిలోనే ఉండాలంటే సొంత కేడర్ తప్పనిసరి. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా రమేశ్‌మహరాజ్ కొనసాగుతున్నారు. ఆయనకు ఏఐసీసీ, పీసీసీలోనూ కీలక భాద్యతలున్నాయి. నియోజవకర్గ ఇన్‌చార్జి భాద్యతలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తీసుకొనే అవకాశాలు ఉన్నాయి. అయితే అందుకు నియోజకవర్గంలో విశ్వాసంగా ఉండే నాయకుల గుర్తించి వరుసగా వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలతో పాటు పార్టీలో కీలక పదవులు కట్టబెట్టి కేడర్ పెంచుకొనేందుకు యత్నిస్తున్నారని సమాచారం.

ఇద్దరు బాలికలు అదృశ్యం



అదృశ్యమైన బాలికలు

పహాడీషరీఫ్: ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మరియం నగర్ కాలనీకి చెందిన అస్మాబేగం ఈ నెల 4న సాయంత్రం స్థానికంగా తాను పనిచేసే రుఖియా బేగం వద్ద జీతం డబ్బులు తీసుకు రమ్మని తన కుమార్తె రజియా బేగం(16), అక్క ఆబేదా కుమార్తె సుమయా బేగం(13)లను పంపించింది. వారు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అస్మాబేగం వెంటనే రుఖియా బేగానికి ఫోన్ చేయగా, అప్పటికే డబ్బులు తీసుకొని వెళ్లారని చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె బాలికల కోసం వెతికినా ఆచూకీ లభ్యమవ్వలేదు. తన వస్త్రాలతో కూడిన బ్యాగ్‌ను సుమయా తీసుకెళ్లినట్లు తెలిసింది. గతంలో కూడా సుమయా ఇలాగే వెళ్లి నాలుగు రోజుల అనంతరం తిరిగి వచ్చింది. శుక్రవారం అస్మాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాళ్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించి పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాలు అభివృద్ధితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ప్రత్యేక నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

ప్రభుత్వం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని సుల్తానాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రజాపాలనకు ప్రజలనుంచి విశేష స్పందన వస్తోందన్నారు.



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు

పూడూరు: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు బాధ్యాతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పెంటయ్య, మండల అధ్యక్షుడు సురేందర్, సుభాశ్, ఖలీల్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం అదృష్టం

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని మాజీ ఎమ్మెల్యే, కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన క్లబ్ నూతన సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతీ ఒక్కరూ సేవా భావంతో మెలగాలన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అంధత్వ నివారణ కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. దంత వైద్యశిబిరం, రక్తదాన శిబిరం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, మొక్కలు నాటడం, వినికిడి మిషన్ల పంపిణీ తదితర కార్యక్రమాలతో పేదలకు సేవ చేస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. త్వరలో కొడంగల్‌లో ప్రభుత్వం తరపున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, దాసప్ప యాదవ్, ఏన్గుల భాస్కర్, శ్రీకిషన్‌రావు, మురహరి వశిష్ఠ, జయతీర్థాచారీ, డాక్టర్ సాకేత్, మునీర్, దామోదర్ రెడ్డి, సరాఫ్ శ్రీనివాసాచారీ, భీంరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో లయన్స్‌క్లబ్ సభ్యులు

హైదరాబాద్‌కు మరో ఎక్స్‌ప్రెస్ సర్వీస్

వికారాబాద్ అర్బన్: ప్రయాణికుల సౌలభ్యం కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవతో మరో ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శుక్రవారం ఆమె డిపో నుంచి రిబ్బన్ కట్ చేసి నూతన సర్వీసును ప్రారంభించింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. డిపో లో 65 బస్సులుండగా 64 ఆర్డినరీ సర్వీసులున్నాయన్నారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో ఈ సర్వీసును ప్రారంభించినట్లు వివరించారు. భవిష్యత్‌లో సర్వీసులు పెంచుతామని స్పీకర్ మాటిచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, డిపో మేనేజర్ భక్తి నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, రత్నారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంజుల

ప్రజాపాలనకు గ్రామానికి రూ.10వేలు

- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- పెద్ద పంచాయతీల్లో సరిపడక ఇబ్బందులు

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు మండలంలోని అన్ని పంచాయతీలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ప్రజాపాలన కార్యక్రమంతో జీపీలకు ఆర్థిక భారం ఏర్పడవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ ఉద్యోగులను నియమించి వారి సహకారంతో అర్జీలను స్వీకరిస్తోంది. డిసెంబర్ 28 నుంచి మొదలైన ప్రజాపాలన కార్యక్రమం నేటితో ముగియనుంది. మండలంలో 33 జీపీలుండగా రూ.3.30లక్షలు నిధులను ప్రభుత్వం వెచ్చించింది. కానీ చిన్న జీపీల్లో మాత్రం నిధులు సరిపోతున్నా పెద్ద జీపీల్లో మాత్రం సరిపోవడంలేదని వాదనలు వినిపిస్తున్నాయి. జనాభా ఎక్కువగా ఉండడంతో కౌంటర్లను ఎక్కువగా ఏర్పాటు చేయాల్సి వస్తుందని ప్రభుత్వం నుంచి అందిన నిధులు సరిపోవడంలేదని పలువురు ఉద్యోగులు సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పంచాయతీల నుంచి కొంత జత చేసి ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. జనాభా ఆధారంగా ప్రజాపాలన నిధులు విడుదల చేస్తే భారం తగ్గేదని పలు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నాయి. నిధుల కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచించి పెద్ద జీపీలకు నిధులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కోర్టు భవన నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు భవన సముదాయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం కోర్టు భవన నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించి నిర్మించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం గుర్తిస్తామన్నారు. తహసీల్దార్‌తో మాట్లాడి అనువైన స్థలం ఎంపిక చేస్తామన్నారు. దానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులకు ఇబ్బందులు లేకుండా కోర్టు భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూలు జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణశర్మ, ఉపాధ్యక్షులు యాదీలాల్, జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, సభ్యులు వెంకట్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, జమీల్ అహ్మద్, రామకృష్ణ, శేఖర్, మధు, మల్లేశ్, సంతోష్, గణేశ్, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ సత్కార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎక్సైజ్ స్టేషన్ సందర్శన

ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు. ఎక్సైజ్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను ఎక్సైజ్ సీఐ కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్
- అక్రమ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని.. ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్ హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం సర్వే నంబర్ 106తో పాటు తట్టిఖానా సర్వే నంబర్ 26లోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలను మండల తహసీల్దార్ రవీందర్ దత్ ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీల సహాయంతో ఆర్ఐ కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమవ్వడంతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టారన్నారు. నిరుపేదలను, అమాయకులను ఆసరాగా చేసుకుని కబ్జాదారులు పభుత్వ స్థలాలను విక్రయిస్తుంటే కొనుక్కొని మోసపోకూడదని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకులు తమవంతు సహకారం అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇందులో భాగంగా శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటీలో రౌండ్‌టేబుల్, లేడీస్ సర్కిల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు పాఠశాల గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, సురేందర్, శివశంకర్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, ఎంఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

కేశంపేట: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో తుక్కుగూడ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వేణుగోపాలస్వామి దేవాలయ ముఖద్వారాన్ని నిర్మించారు. శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.51 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు మంజుల మల్లేశ్, వెంకట్‌రెడ్డి, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, భాస్కర్‌గౌడ్, దశరథ, తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్, ప్రధానోపాధ్యాయుడు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

బంట్వారం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధారూరు సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం కర్ణాటక రాష్ట్రం నుంచి తొర్మామిడి వైపు బైక్ వస్తున్న ఇద్దరు వ్యక్తలను టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తనిఖీ చేయగా వారి వద్ద అరకేజీకి పైగా గంజాయి లభ్యమైంది. గంజాయిని సీజ్ చేసిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు.



టాస్క్ ఫోర్స్ పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న నిందితులు

మినీ డీజిల్ ట్యాంకర్ సీజ్

కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం నుంచి మినీ డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ధారూరు సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ చెప్పిన ప్రకారం సుమారు 2,800కు పైగా లీటర్ల డీజిల్‌ను శంకర్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి మినీ ట్యాంకర్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. బంట్వారం చౌరస్తాలో వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సమాచారం ఇచ్చారు. డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సృజనాత్మకత ముఖ్యం

- గురుకులాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారద
- పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు నాణ్యమైన విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర గురుకులాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారదావెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాలలో జెన్య ఈవెంట్స్ 2023–24, జెన్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్, రంగోళి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. విద్యార్థులు బోధన, అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదుల్లో చేసిన కృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారదావెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చేసిన సైన్స్ నమునాలు, రంగోళి ఎంతో చక్కగా ఉన్నాయన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని ఆలోచనలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, ఉపాధ్యాయుడు దర్శన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న శారద